క్లుప్తంగా

అశోక్ సేవలు అభినందనీయం



అశోక్‌ను సన్మానిస్తున్న వీసీ పద్మరాజు, చిత్రంలో నూతన రిజిస్ట్రార్ సుధాకర్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఆచార్య టి.అశోక్ అందించిన సేవలు అభినందనీయమైనవని వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. నూతన రిజిస్ట్రార్‌గా ఆచార్య జి.సుధాకర్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం టి.అశోక్‌ను ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

మధురపూడి: కోరుకొండ మెయిన్ రోడ్డులోని శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం మొదటి శనివారం కావడంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ పసుపులేటి రెడ్డమ్మ, బొండాడ చందు ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత, తోమాల సేవలు జరిగాయి. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాత

సీతానగరం: చినకొండేపూడిలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మండల అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని అఖిల భారత చిరంజీవి యువత రాష్ట్ర కార్యదర్శి ఏడిద బాబ్జీ ప్రారంభించారు. శిబిరంలో 78 మంది రక్తదానం చేశారు.

క్రీడా పోటీలు ప్రారంభం



పందలపాక పాఠశాలలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక శ్రీపడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల అంతర్గత క్రీడా పోటీలను ఇన్‌చార్జి హెచ్‌ఎం టి.జయకృష్ణారెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజులు టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం జయకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీవిద్యార్థులను గ్రూపులుగా విడదీసి జూనియర్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని బహుమతులు అందజేస్తామన్నారు. పోటీలను పీడీ దార్ల్యంపూడి యువరాజారెడ్డి, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

చేతివృత్తులతో మహిళల ఆర్థికాభివృద్ధి

రాజానగరం: పేదింటి మహిళల ఆర్థికాభివృద్ధికి చేతివృత్తులు తోడ్పడతాయని దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధ్యక్షుడు సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తోకాడలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో 70 మంది మహిళలకు టైలరింగ్‌లో ఇచ్చే ఉచిత శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించారు. ఇదే గ్రామంలో గతంలో మగ్గం వర్కులో కొంతమంది మహిళలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుంకర వీరాస్వామి, నాగేశ్వరరావు, వినీల, ఫణి, పద్మాంజలి, ట్రైనర్ ఈవూరి దుర్గ పాల్గొన్నారు.

క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీలు



వడిశలేరులో సీసీ రోడ్డు నాణ్యతను పరీక్షిస్తున్న అధికారులు

రంగంపేట: రంగంపేట మండలం వడిశలేరులో విజిలెన్సు, క్వాలిటీ కంట్రోల్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. జాతీయ ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, జీజీఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, సచివాలయాలు, ఆర్‌బీకేలను సందర్శించారు. సీసీ రోడ్లకు మిషన్‌తో రంధ్రాలు చేసి నాణ్యతను పరీక్షించారు. తనిఖీల్లో క్వాలిటీ కంట్రోల్ డీఈఈ టి.సురేష్‌కుమార్, క్వాలిటీ కంట్రోల్ జేఈ అహ్మద్, మండల జేఈ కె.శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



పల్ల కడియంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత



9వ వార్డు మెంబర్‌గా ఎన్నికైన మణికంఠకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి పుష్పలత



కాండ్రేగుల 3వ వార్డు మెంబర్ స్థానానికి ఎన్నికైన ప్రవీణ్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి గణేష్‌బాబు



కలవచర్లలో క్యూలో ఉన్న ఓటర్లు



అరుణ పెండ్యాల (పల్ల కడియం)



తాతపూడి సత్యవతి (కలవచర్ల)

ప్రశాంతంగా ఉప ఎన్నికలు

- నత్తా చాటిన వైఎస్సార్ సీపీ మద్దతుదారులు
- దుప్పలపూడిలో పోటీ జరిగిన రెండు వార్డుల్లోనూ విజయబావుటా



దుప్పలపూడిలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో నిలుచున్న ఓటర్లు

అనపర్తి: మండలంలోని పలు పంచాయతీల్లో వార్డులకు జరిగిన ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని దుప్పలపూడి పంచాయతీ పరిధిలోని 1, 9వ వార్డు మెంబర్లకు శనివారం జరిగిన ఉప ఎన్నికలో రెండు వార్డుల్లోనూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు అత్యధిక ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. పోటీల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీలో నిలిచిన వల్లభశెట్టి శివపద్మిని(1వ వార్డు) 121 ఓట్లు, దొండపాటి మణికంఠ(9వ వార్డు)135 ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా టీడీపీ సానుభూతిపరులుగా బరిలో దిగిన సిరసపల్లి అమల, చిర్ల త్రినాథరెడ్డిల డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఉప ఎన్నికలో పార్టీ మద్దతుదారులే విజయం సాధించడం ద్వారా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మరోసారి తన పట్టును నిలుపుకున్నట్టైంది. మండలంలోని రామవరం పంచాయితీ పరిధిలో 3 వార్డు మెంబర్‌కు జరగాల్సిన ఎన్నికలో కర్రి రుక్మిణి ఎన్నిక ఏకగ్రీవం కావడంతో దుప్పలపూడి 1, 9 వార్డులకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ మందకొడిగానే సాగినా పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం సుమారు 82 శాతం ఓటింగ్ నమోదైంది. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు పూర్తి హవా కనబరచడంతో టీడీపీ పెద్దలు కంగుతిన్నారు. 1వ వార్డులో మొత్తం 206 మంది ఓటర్లకు గాను మహిళలు 80 మంది పురుషులు, 96 మంది మహిళలు మొత్తం 176 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 9వ వార్డులో 206 మంది ఓటర్లకు గాను మహిళలు 78, పురుషులు 83 మొత్తం 161 మంది ఓటు వేశారు. పోటీలో 1వ వార్డు మెంబర్‌గా పోటీలో నిలిచిన వల్లభశెట్టి శివపద్మినికి 148 ఓట్లు రాగా, సిరసపల్లి అమలకు 27 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. 9 వార్డు సభ్యుడుగా పోటీలో నిలిచిన దొండపాటి మణికంఠకు 146 ఓట్లు రాగా, చిర్ల త్రినాథరెడ్డికి 11 ఓట్లు మాత్రమే వచ్చాయి. 1వ వార్డులో 1, 9వ వార్డులో 4 ఓట్లు చెల్లకుండా పోయాయి. ఎన్నికల్లో విజయం సాధించిన వార్డు సభ్యులకు స్టేజ్-1 ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.పుష్పలత ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. దుప్పలపూడి హైపర్ సెన్సిటివ్ గ్రామం కావడంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రెండు పోలింగ్ కేంద్రాల వద్ద సుమారు 40 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ జి.వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ ఎం.కిషోర్ కుమార్‌లు ఎన్నికల కేంద్రాలను సందర్శించారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల సంబరాలు.....

ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఘన విజయం సాధించడంతో మండల వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో రెట్టించిన ఉత్సాహం నెలకొంది. ఎన్నికల్లో వార్డు సభ్యుల విజయంతో దుప్పలపూడిలో పార్టీ శ్రేణులు నూతనోత్సాహంతో సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ అనపర్తి గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు ఎస్ఎస్, మహేంద్ర రెడ్డిలు ఎన్నికల్లో విజయం సాధించిన వి.శివపద్మిని, బి.మణికంఠలకు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కాండ్రేగుల 3వ వార్డు మెంబర్‌గా ప్రవీణ్ గెలుపు

పెదపూడి: కాండ్రేగుల గ్రామంలో 3వ వార్డు మెంబర్ స్థానానికి శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో పేపకాయల ప్రవీణ్ 115 ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్లు ఎన్నికల స్టేజ్ 1, స్టేజ్ 2 అధికారి ఎల్.గణేష్‌బాబు తెలిపారు. గ్రామంలో మూడో వార్డు స్థానానికి పేపకాయల ప్రవీణ్, పేపకాయల సత్యసాయిబాబు మధ్య ఎన్నిక జరిగింది. వార్డులో 207 ఓట్లకు గాను 155 ఓట్లు(75 శాతం) పోలయ్యాయి. వీటిలో ప్రెజర్ కుక్కర్ గుర్తు గల ప్రవీణ్‌కు 135 ఓట్లు రాగా, గౌను గుర్తు గల సత్యసాయిబాబుకు 20 ఓట్లు పోలయ్యాయి. అనంతరం ప్రవీణ్‌కు ఎన్నికల అధికారి గణేష్‌బాబు ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.విజయభాస్కర్, వీఆర్వో హరిచంద్రప్రసాద్, సచివాలయం కార్యదర్శులు యాళ్ల ఉమామహేశ్వరరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం మండలంలో...

రాజానగరం: మండలంలోని పల్లకడియం, కలవచర్ల పంచాయతీల పరిధిలో రెండు వార్డులకు శనివారం ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పల్లకడియం 4వ వార్డుకు జరిగిన పోలింగ్‌లో 187 మందికి గాను 177 మంది (94.65 శాతం), కలవచర్లలో 302 మందికి గాను 206 మంది (68.21 శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలీసు బందోబస్తు నడుమ జరిగిన ఈ ఎన్నికల సరళిని పల్లకడియంలో కలెక్టర్ మాధవీలత పరిశీలించారు.

వైఎస్సార్ సీపీ మద్దతుదారులదే విజయం

పల్లకడియం, కలవచర్లలో వైఎస్సార్ సీపీ మద్దతదారులే విజయం సాధించారు. పల్లకడియంలో 4వ వార్డు నుంచి పెండ్యాల అరుణ ప్రత్యర్థి చావా పరిమళపై 10 ఓట్లు ఆధిక్యంతో విజయం సాధించారు. కలచవర్లలో తాతపూడి సత్యవతి ప్రత్యర్థి గవరపు గంగాభవానిపై 49 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఎన్నికల సహాయాధికారిగా ఎంపీడీఓ బి.రామారావు వ్యవహరించారు.

ఐదింట నాలుచోట్ల వైఎస్సార్‌సీపీయే

మండలంలోని ఐదు పంచాయతీలలో ఖాళీగా ఉన్న ఐదు వార్డులకు నిర్వహించిన ఎన్నికలలో నామినేషన్ల పర్వంలో మూడు పంచాయతీలలోని మూడు వార్డులకు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తతుంగపాడులో 6వ వార్డుకు రౌతు సత్యనారాయణ, తోకాడలో 11వ వార్డుకు ఇళ్ల పాపాయమ్మ, నరేంద్రపురంలో 6వ వార్డుకు గొడ్డు వీరపాప ఈ విధంగా ఏకగ్రీవమయ్యారు. వీరిలో కొత్తతుంగపాడు, తోకాడ వార్డులలో విజయం సాధించిన ఇద్దరు వార్డు సభ్యులు అధికార పార్టీ మద్దతుదారులు కాగా, నరేంద్రపురంలో మాత్రం అందరి మద్దతుతో ఇండిపెండెంట్‌గా ఒకరు ఏకగ్రీవమయ్యారు. పోలింగ్ జరిగిన పై రెండు పంచాయతీలలోను వైఎస్సార్ సీపీ బలపరిచిన వార్డు సభ్యులే విజయం అందుకోవడంతో ఐదింట నాలుగు వైఎస్సార్‌సీపీ పరమయ్యాయి.

నిలిచిన ఎన్నిక

మధురపూడి: కోరుకొండ మండలం బుచ్చెంపేట గ్రామంలో ఏడో వార్డుకు ఎన్నిక నిలిచిపోయింది. ఈ వార్డును ఎస్సీ మహిళకు కేటాయించారు. ఇటీవల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేయగా, కేవలం ఒకే ఒక్క నామినేషన్ పడింది. అయితే నిబంధనల ప్రకారం కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించకపోవడంతో స్క్రూటినీలో పోయింది. దీంతో ఎన్నిక నిలిచిపోయింది. పది వార్డులున్న ఈ గ్రామంలో ఏడు వార్డులో పోటీకి ఎవ్వరూ సాహసించడం లేదు.

జగన్ పాలనలో అందరికీ సంక్షేమ పథకాలు



జి.మామిడాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- జి.మామిడాడలో గడప గడపకూ మన ప్రభుత్వం

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని కుటుంబాలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసి ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయంగా ముందుకు దూసుకుపోతుందన్నారు. పేదరికమే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని ప్రజలు చెబుతున్నారన్నారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచ్ లంక మున్ని, ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి, ద్వారంపూడి వెంకన్నబాబు, విప్పర్తి సునీత, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, వుంద్రు సత్యనారాయణ, ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, నల్లమిల్లి వేణురెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటా సర్వేను వేగవంతం చేయాలి



ఓటరు సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, చిత్రంలో ఆర్డీఓ చైత్రవర్షిణి

రాజానగరం: ఓటరు జాబితా స్వచ్ఛీకరణ నేపథ్యంలో బూత్ లెవెల్ అధికారులు తమ పరిధిలోని ప్రతి ఇంటినీ సందర్శించి, ఓటర్లను గుర్తించాలని కలెక్టర్ కె.మాధవీలత బీఎల్‌ఓలకు సూచించారు. సమ్మర్ స్పెషల్ రివిజన్ 2024లో భాగంగా పల్లకడియంలో రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్రవర్షిణితో కలిసి కలెక్టర్ ఇంటింటా సర్వేను శనివారం నిర్వహించారు. సర్వేకు మరో రెండు రోజులే (21 వరకు) వ్యవధి ఉన్నందున కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించడంలో బీఎల్‌ఓలు కీలకపాత్ర వహించాలన్నారు. నూరు శాతం ఫలితాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ విధులు సమర్థంగా నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దారు పవన్ కుమార్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



శ్రీరామపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- పథకాలతో అందరికీ ప్రయోజనం
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రంలో ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని శ్రీరామపురంలో శనివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం పరంగా ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలు, చేకూరిన ప్రయోజనాలను బుక్‌లెట్ల ద్వారా వివరించారు. ముందుగా శ్రీరామపురం వాసులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

రూ. 2.37 కోట్లతో అభివృద్ధి పనులు

గ్రామంలో గడచిన నాలుగున్నరేళ్లలో రూ.2.37 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. గత ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వంలో చూస్తే కేవలం రూ.20 లక్షలు మాత్రమే అభివృద్ధికి కేటాయించారన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఈ గ్రామంలోని 4,943 మందికి రూ. 1,71,84,410 మేరకు ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, బోయిడి సుబ్రహ్మణ్యం, చప్పిడి బ్రహ్మాజీ, కోటి బ్రహ్మాజీ, సంగుల సత్తిబాబు పాల్గొన్నారు.

లాంచీ రేవు మార్పులతో ప్రయాణికుల అవస్థలు



దేవీపట్నం మండలం పాత అంగుళూరుకు మార్చిన లాంచీ రేవు

సీతానగరం: పురుషోత్తపట్నం నుంచి పోలవరానికి లాంచీపై వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పురుషోత్తపట్నంలో రేవులను మార్చడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. నెల రోజుల క్రితం ఆ గ్రామంలోని ఎత్తిపోతల పథకం వద్దగల విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక లాంచీ రేవును ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సు దిగి నేరుగా రేవుల వద్దకు చేరుకునేవారు. అయితే రేవును అక్కడి నుంచి సత్యసాయి వాటర్ ప్రాజెక్టు వద్దకు మార్చు చేశారు. ఆర్టీసీ బస్సులు కొత్త కాలనీ వరకు వెళ్లడంతో.. అక్కడి నుంచి ప్రయాణికులు కిలోమీటరు దూరంలోని రేవు వద్దకు వెళ్లి లాంచీ ఎక్కి ప్రయాణం సాగించేవారు. కాగా.. వారం రోజుల క్రితం అక్కడి నుంచి దేవీపట్నం మండలం పాత అంగుళూరు వద్దకు లాంచీ రేవు మార్చారు. దీంతో ప్రయాణికులు పురుషోత్తపట్నం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలోని ఆ రేవుకు వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



వీరలంకపల్లి గురుకుల పాఠశాలలో చిన్నారులతో ఎంపీపీ సుంకర శ్రీవల్లీ దంపతులు

గోకవరం: వీరలంకపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకల పాఠశాలలో చదువుతున్న ఏడు గురు విద్యార్థులకు శనివారం ఎంపీపీ సుంకర శ్రీవల్లీవీరబాబు దంపతుల కుమార్తె సావిత్రి పుట్టిన రోజు సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుంకర శ్రీవల్లి మట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఏ అవసరం వచ్చినా మా దృష్టికి తీసుకురావలన్నారు. వంట సామగ్రి కొరతను సిబ్బంది వారి దృష్టికి తీసుకు రాగా త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకట రమణ, పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల వేణిరాణి పలువురు సిబ్బంది ఉన్నారు.

మర్యాదపూర్వకంగా..

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య గెడ్డం సుధాకర్‌ను జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు తాళ్లూరి బాబూ రాజేంద్ర ప్రసాద్, కోరుకొండ చిరంజీవి, డాక్టర్ కొయ్యే ఆనందరత్నం శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధిలో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరారు. వారిలో ఉసురుమర్తి రామారావు, దార ఏసురత్నం, వాసా వర్జిన్, పాము బాబూరావు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా నో బ్యాగ్‌డే

కంబాలచెరువు: విద్యార్థుల్లో సృజనకు పదును పెట్టేలా ప్రతి నెలా మొదటి, మూడవ శనివారాల్లో నో బ్యాగ్‌డే నిర్వహిస్తున్నామని నాగరాజా మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం మోటూరి మంగారాణి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఒకటో తరగతి విద్యార్థులు గణితంలో క్రాఫ్ట్‌వర్క్ చేశారన్నారు. ఈ విద్యా సంవత్సరం నో బ్యాగ్‌డేని కేవలం 1, 2 తరగతులకు పరిమితం చేశారని తెలిపారు.

సాంకేతికతను వినియోగించుకోవాలి



లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



గోకవరంలో డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

3అనపర్తి: ఫొటోగ్రఫీలో కొత్తదనాన్ని, రోజురోజుకు పెరుగుతున్న సాంకేతికతను ఫొటోగ్రాఫర్లు వినియోగించుకోవడంతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకుని వృత్తిలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా స్థానిక వీరుల్లమ్మతల్లి ది ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అనపర్తిలోని తేతలి రామిరెడ్డి మంగయమ్మ చారిటీస్ మహిళా వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పాల్గొని ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధాశ్రమం ప్రాంగణంలో చెట్లు నాటి వృద్ధులకు అన్న వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి తేతలి నారాయణరెడ్డి, సంఘం గౌరవాధ్యక్షులు సాయి, ఓ.నరసింహరావు, ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, నాగలక్ష్మి, సతీష్, సుబ్బు పాల్గొన్నారు.

గోకవరంలో..

గోకవరం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోకవరంలో శనివారం మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెమెరా సృష్టకర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బాలు, గంధం బుజ్జి, తోలేటి రాంప్రసాద్, గంగాధర్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లు తమ నైపుణ్యం ప్రదర్శించి ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా పేరు గాంచేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం ఒకరికి ఒకరు స్వీట్స్ పంచుకున్నారు.

15 నుంచి మేథ ఉత్సవాలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రముఖులు

రాజానగరం: గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో సెప్టెంబర్ 15, 16వ తేదీల్లో మేథ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి సుబ్బరాజు శనివారం ఆవిష్కరించారు. ఇంజినీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా మాదిరిగానే ఈ సాంకేతిక ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా జరిగే పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టు ఎక్స్‌పో, ఇంట్రాక్టివ్ వెబ్ డిజైన్, రోబోరోస్, షార్ట్ ఫిల్మ్ మేకింగ్, ట్రజర్ హంట్, టెక్నికల్ క్విజ్, స్పాట్ ఈవెంట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ. రెండు లక్షల విలువైన బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి కల వారు సెప్టెంబరు 10వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

గైట్‌లో వర్క్‌షాపు

రాజానగరం: చిన్న అంకురాల కనీస ఆచరణీయ ఉత్పత్తి అనే అంశంపై స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో శనివారం ఒకరోజు వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా మెడ్ టెక్ (హైదరాబాద్) డైరెక్టర్ డాక్టర్ నందా పోశి మాట్లాడుతూ విషయ పరిజ్ఞానం, నైపుణ్యం కలిగిన యువతకు ఫార్మసీ రంగం మరింత ఉన్నత స్థాయికి చేరుకునేందుకు తోడ్పడుతుందన్నారు. ఫార్మసీ విద్యను అభ్యసించిన వారు సొంతంగా పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని, మరెందరికో ఉపాధి చూపించవచ్చన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామచంద్రన్ కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ వర్క్‌షాప్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికే ప్రజల పట్టం

రాజానగరం: నియోజకవర్గం ప్రజలు అభివృద్ధి వైపే మొగ్గు చూపుతున్నారనడానికి మండలంలో శనివారం జరిగిన పంచాయతీల ఉప ఎన్నికల ఫలితాలే నిదర్శనమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో గడచిన నాలుగేళ్లలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశారన్నారు. ఈ కారణంగానే పల్లకడియం, కలవచర్లలో జరిగిన ఉప ఎన్నికలలో వైఎస్సార్ సీపీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులను ఓటర్లు గెలిపించారన్నారు. దీనితో రాబోయే సార్వత్రిక ఎన్నికలలోనూ ప్రజలు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారనే నమ్మకం మరింత బలపడిందన్నారు.

పార్కింగ్‌తో ఇబ్బందులు

మధురపూడి: కోరుకొండలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వాహనాలను పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. రిజిస్ట్రేషన్ కోసం వస్తున్న వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో అటుగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సీతానగరం మండలంలోని పలు గ్రామాలతో పాటు, శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి, కోటికేశవరం తదితర గ్రామాలకు వెళ్లాలంటే ఇదే ప్రధాన మార్గం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జాబ్‌మేళా

సీటీఆర్ఐ: వికాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. శనివారం వికాస ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాకి 35 మంది హాజరయ్యారు. వారిలో నాగు ఇన్ఫోటెక్‌కు ముగ్గురు, ఆదిత్య ఇంజినీరింగ్ సర్వీసెస్‌కు ముగ్గురు, డిక్సన్‌కు తొమ్మిది మంది ఎంపికయ్యారు. వికాస మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.